# కాంగ్రెస్ వస్తే కర్ణాటక గతే..

- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- ఆశతో కాదు.. ఆశయం కోసం వచ్చేవారిని ఆదరించండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- ఎదురుగట్ల, చెక్కపల్లి, అచ్చనపల్లి గ్రామాలో ఎన్నికల ప్రచారం



కారు గుర్తుకు ఓటేయాలని ఎదురుగట్లలో మహిళలను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, నవంబర్ 3: 'ఆశతో వచ్చినవారికి కాకుండా ఆశయం కోసం పని చేసే వారిని ఆదరించండి.. కళ్లబొల్లి మాటలు చెప్పి.. బోరున ఏడ్చేవారికి సానుభూతి చూపిస్తే గోసపడుతాం.. కారు గుర్తుకు ఓటు వేస్తేనే ఈ మరింత అభివృద్ధి చెందుతుంది.. కాంగ్రెస్ వస్తే కర్ణాటక గతే.. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష'.. అని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల, చెక్కపల్లి, అచ్చనపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేయగా, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో సాగునీరు, తాగునీరు, కరెంట్‌కు తీవ్ర ఇబ్బందులు ఉండేవని గుర్తు చేశారు. కానీ స్వరాష్ట్రంలో ప్రజలకు సాగునీరు, తాగునీరు, 24 గంటల కరెంటును అందించిన సీఎం కేసీఆర్‌కు మనం రుణపడి ఉండాలన్నారు. కాంగ్రెస్ గెలిస్తే కర్ణాటక పరిస్థితే అవుతుందన్నారు. మూడు గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలో..? మూడు గంటలే ఇస్తామంటున్నా కాంగ్రెస్ కావాలో?.. ప్రజలే ఆలోచన చేసుకోవాలన్నారు. ఇంటింటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందినట్లు తెలిపారు. మన పార్టీ, మన ఇంటి పార్టీ బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ.. కారు గుర్తుకు ఓటేయాలన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపిస్తే గ్రామాల్లో మిగిలిపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీఇచ్చారు. నేను సేవ చేయడానికి వచ్చానే తప్పా.. డబ్బులు సంపాదించుకోవడం కోసం రాలేదన్నారు. స్వగ్రామమైన మల్కపేటలో గుడి, కార్పొరేట్ స్థాయిలో బడిని కట్టించానని, తాను పక్కలోకల్ అని.. మల్కపేట గ్రామ బిడ్డనని.. స్పష్టం చేశారు. ఎవరెన్ని చెప్పినా మోసపోకుండా.. కారు గుర్తుకే ఓటేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోస్కుల రవి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచులఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్మ బల్‌రెడ్డి, సర్పంచులు అడ్డిక జైపాల్‌రెడ్డి, ఎల్లవ్వ, ఎంపీటీసీ నర్సవ్వ, నాయకులు సురేశ్, బాలు, శ్రీనివాస్, దేవరాజు, నాగరాజు, మైసయ్య, నిఖిల్, రాంరెడ్డి, ఎల్లయ్య, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా నినదిస్తున్న మహిళలు

# సెల్ఫీ దిగుదాం.. ఓటేద్దాం

- ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయండి • జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్




సెల్ఫీ దిగుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ

కలెక్టరేట్, నవంబర్ 3: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమని, ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటేసి.. సెల్ఫీలు దిగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్వీయచిత్ర కేంద్రాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. కేంద్రం వద్ద 'ఐ విల్ ఓట్.. బీకాజ్ ఐ లవ్ రాజన్నసిరిసిల్ల'తో ఉన్న గుర్తుల వద్ద అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో మామిండ్ల దశరథంతో కలిసి వారు సెల్ఫీలు దిగారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ఈ స్వీయ చిత్ర కేంద్రం కలెక్టరేట్‌లో ఉంటుందని డీపీఆర్వో తెలిపారు. ఇక్కడ సెల్ఫీ దిగి.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యత అందరికీ తెలుస్తుందనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని డీపీఆర్వో చెప్పారు.

# గులాబీ గూటికి నేరెళ్ల జ్యోతి

- గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, నాయకులు

కోనరావుపేట, నవంబర్ 3: కోనరావుపేట మండలం శివలింగంపల్లికి చెందిన మావోయిస్టు పార్టీ జిల్లా కమిటీ మాజీ సభ్యురాలు నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క శుక్రవారం వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరింది. వేములవాడలోని చల్మెడ నివాసంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, ఉద్యమ పార్టీగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే పార్టీగా బీఆర్ఎస్ గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు అన్నివర్గాలకు న్యాయం చేయాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని భావించి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. అలాగే ధర్మారం సర్పంచ్ గున్నాల అరుణ బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కండువా కప్పి ఆహ్వానించారు.

# టీషర్టులపై పథకాలు అభినందనీయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి రూపొందించిన టీషర్టును ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్, చల్మెడ

గంభీరావుపేట, నవంబర్ 3: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను టీషర్టులపై ముద్రించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం సంతోషకరమని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభినందించారు. కమలాకర్‌రెడ్డి తన సొంతఖర్చులతో 500టీషర్ట్‌లపై బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ముద్రించగా, శుక్రవారం ఆయన వేములవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు తో కలిసి ఆవిష్కరించారు. వినూత్న ఆలోచనల ద్వారా ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కేటీఆర్‌కు మద్దతుగా కేటీఆర్ సేన ఆధ్వర్యంలో ప్రచారం చేయాలని సూచించారు.

# మేమంతా.. రామన్న వెంటే..

- ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న కులసంఘాల సభ్యులు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం
- అమాత్యుడికి లక్షకు పైగా మెజార్టీ అందించాలని అభ్యర్థన



ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

సిరిసిల్ల, నవంబర్ 3: సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులు చేస్తున్న ప్రచారం జోరందుకున్నది. గడపగడపకూ వెళ్తూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన అమాత్యుడు రామన్నకు లక్షకుపైగా మెజార్టీ అందిద్దామని వారు ఓట్లు అభ్యర్థించారు. కేటీఆర్ లేకుంటే ఈ ప్రాంతం ఇంత అభివృద్ధి చెందేది కాదని.. మేమంతా రామన్న వెంటే ఉంటామంటూ.. తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్‌లో యాదవ సంఘం నాయకులు, గౌడ సంఘం నాయకులు, మండెపల్లిలోని కేసీఆర్‌నగర్ కాలనీ అసోషియేషన్ సభ్యులు, గంభీరావుపేట మండలం శ్రీగాధలో, ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాలో ముదిరాజ్ సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసి, సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కారు గుర్తుకే ఓటేసి రామన్నను మరోసారి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

కోనరావుపేట, నవంబర్3: నూతనంగా పార్టీలో చేరిన యువకులు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. నిమ్మపల్లి, మల్కపేట గ్రామాలకు చెందిన సుమారు 50మంది కాంగ్రెస్, బీజేపీకి చెందిన యువకులు శుక్రవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సీనియర్ నాయకులు జవ్వాజి దేవయ్య, జవ్వాజి ప్రసాద్, తదితరులు ఉన్నారు.